ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 25 ఆగస్టు 2024







వారెవ్వా.. వర్జీనియా!

వర్జీనియా పొగాకు... అత్యంత ఖరీదైన పంట. రైతులకు గ్యారంటీగా రాబడులను మిగిల్చే పంట. ప్రభుత్వ సహకారంతో అంతర్జాతీయ విపణిలో అమ్ముకునే సౌకర్యం ఉన్న పంట. అందుకే ఈ పొగాకు సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. రక్షణ, ప్రోత్సాహకాలు ఉండటంతో అనేక అవరోధాలు ఎదురవుతున్నా రైతులు సాగు బాటలో ముందుకుసాగుతున్నారు. దేశానికి ప్రతి ఏటా వందల కోట్ల రూపాయలు విదేశీమారక ద్రవ్యం సాధించిపెట్టే ఈ పంట ద్వారా వేలాది మంది రైతులతో పాటు కార్మికులు ఉపాధిని పొందుతున్నారు. ఒక్కో బ్యారన్ పొగాకు పండించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా కనీసం 100 మందికి పైగా ఉపాధి కలుగుతుంది. వర్జీనియా పొగాకులో రెండు రకాల విత్తనాలు ఉంటాయి. నేలస్వభావాన్ని బట్టి ఈ విత్తనాలను వేస్తుంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని పశ్చిమగోదావరి జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్ఎల్ఎస్ (తేలికపాటి నేలలు)వర్జినియా పంటను పండిస్తుంటారు. గుంటూరు పరిసరాల్లో ఎస్ఎల్ఎస్ (బ్లాక్ సాయిల్) వర్జినియా పొగాకును పండిస్తుంటారు. ఒక్క ఎన్ఎల్ఎస్ పొగాకునే ఏటా 45 మిలియన్ టన్నులకుపైగా పంటను పండిస్తుంటారు.

- టుబాకో బోర్డు ద్వారా ప్రోత్సాహకాలు, అంతర్జాతీయ మార్కెట్
- ఒక్క బ్యారన్ పొగాకు సాగు ద్వారా 100మందికి పైగా ఉపాధి
- ఖరీదైన సిగరెట్ల తయారీలో వర్జీనియా పొగాకు వాడకం
- భద్రాద్రి జిల్లాలో సాగుకు అనువుగా ఉన్న తేలికపాటి నేలలు
- ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి.. సగటు ఆదాయం లక్షా 30వేలపైనే
- కిలో వర్జీనియా పొగాకు ధర రూ.300 పైనే...
- దేశానికి విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చుతున్న పంటగా గుర్తింపు
- అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విస్తృతంగా సాగు

రైతులకు కాసులు రాలుస్తున్న ఖరీదైన పంట

అశ్వారావుపేట, ఆగస్టు 24: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పరిధిలో ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు పంటను పండిస్తుంటారు.ఈ ప్రాంతంలో 734 బ్యారన్ల పంటను పండిస్తుంటారు. బోర్డు అనుమతి ప్రకారం ఒక్కో బ్యారన్‌కు 34క్వింటాళ్ల పంటకు అనుమతించారు. పండించిన పంటను పశ్చిమగోదావరి జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం ప్లాట్‌ఫారమ్-1, అండ్ 11లు మొత్తం ఐదు ఫ్లోర్‌లలో వేలం వేస్తారు. వర్జీనియా పొగాకు పంటకు రక్షణ, మార్కెటింగ్ వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మకాలు, ధర, సొమ్ముకు గ్యారంటీ, బ్యాంకుల ద్వారా టై అప్ రుణాలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గుంటూరులో టుబాకో బోర్డును ఏర్పాటుచేశారు. బోర్డుకు ఐఏఎస్ అధికారి చైర్మన్‌గా, రైతులనుంచి వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులు పాలకవర్గ సభ్యులుగా ఉంటారు. వర్జీనియా పొగాకు ఏపీ, తెలంగాణలో కలిసి ప్రతి ఏటా సుమారు 100 మిలియన్ టన్నుల వరకు ఉత్పత్తి అవుతుంది. అలానే కర్ణాటక రాష్ట్రంలో మరో 100మిలియన్ టన్నుల పొగాకు ఉత్పత్తి అవుతుంది. మనదేశంలో పండిన వర్జీనియా పొగాకు చైనా, రష్యా, బల్గేరియా వంటి దేశాలకు ఎగుమతి అవుతుంటుంది. పెద్దల పొగాకుగా పేరొందిన వర్జీనియాను అధికశాతం ఖరీదైన సిగరెట్ల తయారీలో ఉపయోగిస్తారు. ఈ పంటను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా ఏటా రూ.వందల కోట్ల విదేశీమారక ద్రవ్యం లభిస్తుంది.

లాభాల పంట

వర్జీనియా పొగాకు సాగు రైతులకు లాభాల పంటను పండిస్తోంది. ఎకరాకు సరాసరిన 10 క్వింటాల వరకు వరకు దిగుబడి వస్తుంది. ప్రసుతం పొగాకు సాగుకు ఎకరానికి రూ.2లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. కిలోకు సగటు ధర రూ.330 పలుకుతున్నందున, ఎకరాకు రూ.3లక్షల 30వేల వరకు ఆదాయం వస్తుంది. టుబాకో బోర్డు బ్యారన్‌ల వారీగా పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇస్తుంది. ఒక్కో బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల పొగాకును ఉత్పత్తి చేసేందుకు అనుమతి ఇచ్చింది. సాధారణంగా నాలుగు ఎకరాల్లో పంటకు ఒక బ్యారన్ సరిపోతుంది. వర్జీనియా సాగు ప్రక్రియ మొత్తం ఆర్నెల్లలో పూర్తవుతుంది.

కిలో ధర రూ.300 పైనే

వర్జీనియా పొగాకు కొనుగోళ్లు టుబాకో బోర్డు పర్యవేక్షణలో జరుగుతాయి. దేశ, విదేశాలకు చెందిన పలు కంపెనీలకు చెందిన బయ్యర్లు వేలం కేంద్రాలకు హాజరై, కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం కిలో పొగాకు ధర రూ.300పైనే పలుకుతోంది. వర్జీనియా పొగాకు చరిత్రలో ఇదో రికార్డుగా చెప్పవచ్చు. ఈపొగాకు ధరలు బాగా పెరగడం, పెట్టిన పెట్టుబడులు నాలుగునెలల్లో చేతికి రావడం, మార్కెటింగ్, బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉండటంతో ఈ పంటను వేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దేశ, విదేశాలకు చెందిన 60 కంపెనీలకు చెందిన బయ్యర్లు పొగాకును వేలం ద్వారా కొనుగోలు చేస్తారు. బయ్యర్లు కొనుగోలు చేసిన పొగాకు సొమ్ముకు బోర్డు గ్యారంటీగా ఉంటుంది.

తగ్గిన దిగుబడులు...

ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు పంట ఉత్పత్తులు అధికంగానే ఉంటాయి. పశ్చిమగోదావరి, భద్రాద్రి జిల్లాలో పండిన ఎన్ఎల్ఎస్ పంట దిగుబడులు ఈ ఏడాది బాగా తగ్గాయి. వాతావరణ మార్పులో, రసాయన ఎరువుల వాడకం వల్లనో దిగుబడులు తగ్గినట్టు రైతులు భావిస్తున్నారు. ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి వుండగా, ఈ ఏడాది 8-10 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీంతో రైతులకు ఆదాయం తగ్గింది. ఒక్క అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతంలోనే 734 బ్యారన్ల ద్వారా ఏటా సుమారు 24,956 క్వింటాళ్ల పొగాకు పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో 5వేలమందికి పైగా రైతులు, కార్మికులు, కూలీలకు ఈ పంట ద్వారా ఉపాధి కలుగుతోంది.

బోర్డు సంరక్షణలో...

వర్జీనియా పొగాకు పంట రక్షణకోసం ఏర్పాటు చేసిన టుబాకో బోర్డు రైతుకు వెన్నంటి ఉంటుంది. ప్రతిబ్యారన్ లైసెన్సుకి ఏటా రూ.5లక్షలవరకు బోర్డు ష్యూ రిటీతో రుణం ఇప్పిస్తారు.ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరకు సరఫరా చే స్తారు. బయ్యర్లను రప్పించి అంతర్జాతీ య కంపెనీలను రంగంలోకి దింపి మా ర్కెట్‌ను కల్పిస్తారు. పరిశోధన కేంద్రాలు, శాస్త్రవేత్తల వ్యవస్థను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను అందజేసే వ్యవస్థను ఏర్పాటు చేశారు.



సరాసరి కిలో ధర రూ.330
సుంకవల్లి వీరభద్రరావు, పొగాకు రైతు

అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకుకు డిమాండ్ పెరగటంతో ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అత్యధికంగా కిలో పొగాకు రూ.399 పలికింది. సరాసరి రూ.330వరకు ధర లభించింది. ప్రతిఏటా ఇదే ధరలు వచ్చేలా బోర్డులు చూడాలి. పొగాకు సాగులో ఖర్చులు కూడా పెరిగాయి. భూముల కౌలు, కూలీల ఖర్చులు కూడా పెరిగాయి. పొగాకు ధర పెరగటంతో కొంత మేర ఉపశమనం ఉంది.

ఇక్కడా కావాలొక 'హైడ్రా'

- ఖమ్మం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఆక్రమణలు
- నిబంధనలు ఉల్లంఘించి విచ్చలవిడిగా నిర్మాణాలు
- గత ఏడాది మున్నేరు వరదల వేళ బయటపడిన బండారం
- ప్రభుత్వ స్థలాలను వదలని అక్రమార్కులు
- అనేక రకాల ఒత్తిళ్లతో అధికారగణం మౌనం
- శాఖల మధ్య సమన్వయలోపంతో కబ్జాదారులకు అవకాశం
- హైదరాబాద్‌లో 'హైడ్రా' ద్వారా తొలగింపులపై ప్రజల్లో హర్షాతిరేకాలు

ఖమ్మం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ భూములు, నదులు, ఏర్లు బఫర్‌జోన్లు, చెరువు శిఖాలు, దేవాదాయ, వక్ఫ్‌భూముల్లో అక్రమంగా పాగా వేసిన భూకబ్జాదారుల్లో ఇప్పుడు భయాందోళనలు కనిపిస్తున్నాయి. హైదరాబాదులో హైడ్రా పేరుతో ప్రభుత్వం భూ ఆక్రమణలపై కొరడా ఝుళిపించడంతో పాటు కోట్ల విలువైన అక్రమ కట్టడాలను కూడా క్షణాల్లో కూల్చివేత ప్రక్రియ చేపట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైడ్రాలాంటి సంస్థలను జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలనే సూచనలు అధికంగా వినిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రాలైన ఖమ్మం, కొత్తగూడెంతో పాటు ఉమ్మడిజిల్లాలో పలు మునిసిపల్, మండల కేంద్రాల్లో భూ ఆక్రమణలు, కబ్జాలు అధికంగా ఉన్నాయి జిల్లా కేంద్రం ఖమ్మంలో మున్నేరు బఫర్‌జోన్‌లో రెండువైపులా పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు ఇప్పటికే జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. గతేడాది భారీగా మున్నేరుకు వరద రావడంతో అక్రమ నిర్మాణాల కారణంగా పెద్దఎత్తున వరద ఖమ్మం నగరంలోకి పొంగి ప్రవహించి వేల ఇళ్లను ముంపునకు గురిచేసింది. మున్నేరుకు ఇరువైపులా, పద్మావతినగర్, వెంకటేశ్వనగర్, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, ధంసలాపురం, జలగంనగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌గృహకల్ప, కరుణగిరి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున ఇళ్లు ముంపునకు గురై అధికంగా నష్టపోయారు. కొన్ని భవనాలు కూలిపోయాయి.

మున్నేరుకు రెండువైపులా ప్రభుత్వ భూమితోపాటు నిషేధిత భూముల్లో కూడా అడ్డదారిలో అనుమతులు పొంది అక్రమంగా ఇళ్లు, భవనాలు, అపార్టుమెంట్లు నిర్మించారు. దీంతోపాటు లకారం చెరువు కూడా పెద్ద ఎత్తున కబ్జా అయింది. ఖమ్మంఖిల్లా పురాతన చారిత్రక కట్టడం ప్రాంతంలోని ఖాళీ భూముల్లో కూడా అక్రమంగా భవనాలు నిర్మించారు. స్తంభాద్రి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం నలువైపులా కూడా ఆక్రమణలు జరిగాయి. ఖమ్మం ఎన్ఎస్‌పీ భూములు ఆక్రమణల పరంపరం ఇంకా కొనసాగుతూనే ఉంది.

పాలేరు నుంచి కల్లూరు వరకు ఎన్ఎస్‌పీ కాలవకు మిగులు భూములు, ఖాళీ భూములకు వారసుల పేర్లతో తప్పుడు దస్ర్తాలు సృష్టించి రెవెన్యూ, ఎన్ఎస్‌పీ, ల్యాండ్ సర్వే అధికారులకు ముడుపులు చెల్లించి ఎన్‌వోసీలు పొంది వేల ఎకరాల భూములు ఆక్రమించుకున్నారు. ఎన్ఎస్‌పీకి కోట్ల విలువైన భూమి ఏడాదికేడాది కనుమరుగవుతుంది. శాటిలైట్ ఛాయాచిత్రాల్లో (మిగతా 6వ పేజీలో)



కొత్త అస్త్రం మిస్ మ్యాచ్

- ఆర్టీఏలో దొంగ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో సాకులు
- తీగలాగితే డొంక కదిలే అవకాశం
- పోలీసు శాఖ విచారణ ముందుకు సాగేనా?
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఏలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల (ఆర్‌సీ)లో మార్ఫింగ్ ద్వారా ఫొటోలను, ఇతర ముఖ్య డాక్యుమెంట్లను మార్చి వాహనాలను ఇతర జిల్లాలు, రాష్ట్రాలు దాటించిన వ్యవహారంలో తీగలాగితే డొంక కదిలే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖమ్మం ఆర్టీఏ కేంద్రంగా సాగిన ఈ దందాలో వేలకొద్ది వాహనాలకు అడ్డగోలుగా దొంగ రిజిస్ట్రేషన్ల వ్యవహారం సాగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆర్టీఏలో మాయ' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఆధారాలతో సహా ప్రచురించడంతో జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. కథనం ప్రచురితమైన నేపథ్యంలో శనివారం కార్యాలయంలోనికి ఏజెంట్లను అనుమతించలేదు. ఇదిలా ఉండగా.. ఆర్టీఏ కార్యాలయంలో అసలు మాటున నకిలీ వ్యక్తులను తీసుకొచ్చి ఆధార్ కార్డులు మార్ఫింగ్ చేసి నో అబ్జెక్షన్ చేసిన విషయంలో బయటకు వచ్చిన రెండు సీసీలను సదరు అధికారి రద్దు చేసినట్టు తెలిసింది. అయితే అసలు సీసీ ఇవ్వాలన్నా, వాటిని రద్దు చేయాలన్నా సంబంధిత వాహనానికి చెందిన యజమాని కోరినప్పుడు మాత్రమే జరగాల్సి ఉంటుంది. ప్రస్తుతం సదరు అధికారి సీసీలు ఇచ్చిన, రద్దు చేసిన సంఘటనలో అలాంటివేమి లేకపోవడం గమనార్హం.

కొద్ది నెలల వ్యవధిలో ఉద్యోగవిరమణ చేపట్టబోయే ఓ అధికారి తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకుగాను ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం. అందులో భాగంగానే అసలు యజమానులకు బదులుగా నమోదైన ఇతర వ్యక్తుల ఫోటోల విషయంలో ఎక్కువమంది సభ్యులున్న సందర్భంలో అలా తప్పులు దొర్లాయన్న సమాధానం ఇచ్చేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకటి రెండు క్లియరెన్స్ సర్టిఫికెట్ల విషయంలో జరిగితే... అది తప్పే అయినప్పటికీ మిస్‌మ్యాచ్‌గా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ పదుల సంఖ్యలో జరిగిన క్లియరెన్స్ సర్టిఫికెట్ల విషయాల్లో ఎలా మిస్‌మ్యాచ్ అవుతోందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఖమ్మం ఆర్టీఏ కేంద్రంగా సాగిన ఈ దందాకు సంబంధించి ఇటీవల పోలీసు శాఖలో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్ జరిగిన క్రమంలో ఓ ఆర్టీఏ ఏజెంట్‌పై మాత్రమే చీటింగ్ కేసు నమోదు చేసినట్టు తెలిసింది. అయితే ఆ విషయాన్ని పోలీసు శాఖ అంతటితో వదిలేశారా? దాని విచారణ ఎంతవరకు వచ్చిందనే విషయంపై మాత్రం స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. పోలీసు శాఖ కేవలం తమ శాఖకు సంబంధించిన పీసీసీ సర్టిఫికెట్లు మాత్రమే పరిశీలించి తప్పుగా అప్రూవల్స్ ఇచ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోగా.. అసలు ఆయా సర్టిఫికెట్లతో వాహనాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరిగాయి అన్న విషయంపై విచారణ జరగలేదన్న వాదన వినిపిస్తోంది. ఎలాంటి విచారణ చేపట్టకుండానే వాహనాలకు క్లియరెన్స్ సర్టిఫికెట్లు మంజూరు చేయగా... ఆ సర్టిఫికెటు ఆధారంగా చేసుకుని అందినకాడికి దండుకుని ఆర్టీఏ అధికారులు కూడా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు సాగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



2వ డివిజన్ పాండురంగాపురంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, మేయర్ నీరజ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 2వ డివిజన్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన 6

ఉత్తమ బస్టాండ్ ఖమ్మం... ఉత్తమ డిపో సత్తుపల్లి...

రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 24: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో ఉత్తమ బస్టాండ్‌గా ఖమ్మం నూతన బస్టాండ్, ఉత్తమ డిపోగా సత్తుపల్లి డిపో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాయి. అవార్డులతోపాటు రూ.3లక్షల క్యాష్ అవార్డును సత్తుపల్లి డిపోకు అందించారు. శనివారం హైదరాబాద్‌లో ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు ప్రగతి చక్ర పురస్కారాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవార్డుల పంట పండిందని ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 99డిపోల్లో సత్తుపల్లి డిపోకే ప్రథమ స్థానం దక్కటం విశేషం. ఈ అవార్డులను ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, సత్తుపల్లి డిపో మేనేజర్ యూ రాజ్యలక్ష్మిలు అందుకున్నారు. నగరంలోని సిటీ బస్టాండ్‌లోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో పని చేస్తున్న కోర్ గ్రూప్ సూపర్‌వైజర్ బి.సైదులు, మణుగూరు డిపోకు చెందిన మెకానిక్ పి.రవి, హెల్పర్ డి.సతీష్‌కుమార్, సత్తుపల్లి డిపోకు చెందిన హెయిర్ బస్ డ్రైవర్ సీహెచ్ కిషోర్ బాబు, కేఆర్ బాబులు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అదుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్, ఖమ్మం రీజనల్ మేనేజర్ సిరిరాం, పాల్గొని అవార్డులు అందుకున్న వారిని అభినందించారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్లు భవాని ప్రసాద్, జీఎన్ పవిత్ర తదితరులు అభినందించారు.



ఉత్తమ బస్టాండ్ అవార్డు అందుకుంటున్న ఖమ్మం డిపో మేనేజర్

గిరిజన సంక్షేమానికి కొత్త పథకాలు

- కొండరెడ్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు
- గిరిజన రైతులకు వంద శాతం సబ్సిడీపై మోటార్లు
- ఐటీడీఏ సమీక్షలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

భద్రాచలం, ఆగస్టు 24: గిరిజన సంక్షేమానికి కొత్తపథకాలు త్వరలో కొత్త పథకాలు ప్రవేశ పెడతామని రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్(ట్రైకార్) చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. భద్రాచలంలో శనివారం గిరిజన సంక్షేమ కోసం చేపడుతున్న వివిధ పథకాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నిరుపేదలైన గిరిజనులకే చెందేవిధంగా యూనిట్ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఎంఎఎస్ఎం యూనిట్ల ద్వారా మహిళలు తయారు చేస్తున్న సబ్బులు, షాంపూల మార్కెటింగ్‌కు పెద్దఎత్తున అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. వైటీసీ ద్వారా నిరుద్యోగ గిరిజన యువతకు వివిధ కోర్సుల్లో నైపుణ్యాల శిక్షణ అందించి వారు తప్పనిసరిగా ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉపాధి పొందేలా చూడాలన్నారు. కొండ ప్రాంతాల్లో నివసించే పీవీటీజీ గిరిజనుల కుటుంబాలకు వారు కోరుకున్న యూనిట్లను వందశాతం సబ్సిడీపై అందించాలని తెలిపారు. 31న గిరిజన శాసన సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గిరిజనుల జీవనోపాధికి పథకాలు చేస్తామన్నారు.

నిరుద్యోగులైన గిరిజన యువతకు ట్రైకార్ జీవనోపాధి కల్పించడానికి నిధులు విడుదల చేశామని, కొన్ని ఐటీడీఏలలో బ్యాంకు లింకేజీ ద్వారా లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతుందని వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవనోపాధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఇచ్చే శిక్షణలు నిరుద్యోగ గిరిజన యువతకు ఐటీసీ బీటీపీఎస్ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైకార్ జీఎం శంకర్‌రావు, అడిషనల్ మేనేజరు లక్ష్మీ ప్రసాద్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏపీవో జనరల్ డేవిడ్ రాజు, డీడీ విజయలక్ష్మి, జీసీసీ డీఎం దావీదు పాల్గొన్నారు.

రూ.426 కోట్లు కేటాయింపు

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల జీవనోపాధి కల్పించడానికి రూ.426 కోట్లు కేటాయించడం జరిగిందని, అందులో ఇప్పటికే రూ.411 కోట్లు విడుదల చేశామని సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలతో పాటు త్వరలో కొత్త పథకాలు ప్రవేశపెట్టనున్నామని అన్నారు. ఐటీడీఏ పీవో స్థాయిలో ప్రతిపాదనలు తెప్పించుకొని పథకాలు అమలు చేస్తామని అన్నారు. త్వరలో ఒక కమిటీని గిరిజనుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన మౌలిక వసతుల గురించి చర్చించి సీఎం దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం ద్వారా అనుమతులు రాగానే గిరిజనులకు అన్ని పథకాలు వందశాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు.



చికిత్స పొందుతున్న దృశ్యం

కలుషిత నీటితో 9మందికి అస్వస్థత

- ఒకరి పరిస్థితి విషమం
- మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు
- పాల్వంచ మండలం పాతసూరారంలో ఘటన
- పైప్‌లైన్ల లీకేజీలే కారణమని గ్రామస్థుల ఆరోపణ
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

వివరాలు : 6లో



ఐదు నందుల నరసింహుడు

- వృద్ధాప్యానికి చేరినా తగ్గని జ్ఞాన తృష్ణ 6
- చదువుపై మక్కువతో భిన్న రంగాల్లో మూడు ఎంఏలు



మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

- చౌక దుకాణాలు సమయం పాటించాలి 7
- విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

Sunday SPECIAL

ఐదు నందుల.. నరసింహుడు


తాటి కొండాల నరసింహారావు

ఒకటి కాదు.. రెండు కాదు.. నాటక రంగంలో ఏకంగా అయిదు సార్లు నంది అవార్డులు సాధించిన ఘనత ఆయనది. నాటకాలు రూపొందించటం రచించటం నటించటమే కాదు.. తెలంగాణ నాటక విశిష్టచరిత్రపై వెలువరించిన పరిశోధన గ్రంథానికి గానూ తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం గడించారు. వయస్సు పైబడినా వృద్ధాప్యానికి చేరినా తనలోని జ్ఞాన తృష్ణ, సాహిత్య , నాటక కళారంగాల పట్ల అనురక్తి నేటికీ నవయవ్వనమే. అవార్డులే కాదు చదువుల్లోనూ యువతరానికి ఈయన మార్గదర్శి ఏకంగా మూడు ఎంఏ పట్టాలు సాధించిన చదువరి ఖమ్మం నగరానికి చెందిన తాటికొండాల నరసింహారావు. నాటక రంగంలో తన బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నారు..

- వృద్ధాప్యానికి చేరినా తగ్గని జ్ఞాన తృష్ణ
- చదువుపై మక్కువతో భిన్న రంగాల్లో మూడు ఎంఏలు
- నాటక రంగంలోనూ మేటి
- వెండితెరకు, ఆకాశవాణికి రచనలు
- బహుముఖ ప్రజ్ఞాశీలి తాటికొండాల నరసింహారావు

ఖమ్మంసాంస్కృతికం, ఆగస్టు 24: ప్రతిష్ఠాత్మక నంది అవార్డును పొందటం సినీ తారలు నుంచి నాటక నటీనటులకు గర్వకారణం. తాటి కొండాల నరసింహారావు నాటక రంగంలో అయిదు నంది అవార్డులను పొందారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటక కళను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో అప్పటి ప్రభుత్వాలు నాటక రంగంలో సైతం నంది అవార్డులను ప్రవేశ పెట్టి అందించింది. ఏటా నంది నాటక పోటీలను ఇందుకోసం నిర్వహించింది. కాగా ఆసయంలో పలు చోట్ల నిర్వహించిన నంది నాటకోత్సవాలలో ఈయన నిర్మించిన నాటకాలు మూడు దఫాలు ఉత్తమ నాటకాలుగా ఎన్నిక కాబడి అవార్డులు దక్కించుకున్నాయి.. వశిష్ఠ విశ్వామిత్ర, చాణక్య చంద్ర గుప్త, విశ్వామిత్ర విజయం అనే నాటకాలకు ఈ బహుమతులు దక్కాయి. కాగా రచయతగా సైతం ఈయన అంతే ప్రతిభ కనబరచటంతో అదే పోటీల్లో ఈయనకు రచయతగా రెండు దఫాలు నంది అవార్డులు వరించాయి.. వశిష్ఠ విశ్వామిత్ర, చాణక్య చంద్రగుప్త అనే నాటకాల రచనకుగానూ ఖమ్మం, గుంటూరుల్లో జరిగిన నంది నాటకోత్సవాలలో ఈయన నంది అవార్డులు సాధించారు. నంది అవార్డులతో పాటు అశ్వం అవార్డు, హనుమా అవార్డుతోపాటుతదితర పలు అవార్డులను పురస్కారాలను అందుకున్నారు.

నాటక రచనలో కీర్తిపురస్కారం..

నాటకాలకు, నాటకాల రచనలకే కాక ఈయన నాటకాలకు సంబంధించి రచించిన తెలంగాణ నాటక చరిత్ర అనే సిద్ధాంత గ్రంథాన్ని సైతం రచించటం నాటక రంగానికి గర్వ కారణం.. కాగా ఈయన రచించిన అనే పుస్తకానికి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందజేసింది. తెలంగాణలో నాటక సమాజాలు, తదితర చరిత్రపై పరిశోధన చేశారు. దీనితో పాటు పది నాటకాలు, పది నాటకలు రచించారు. నరసింహారావు కేవలం నాటకాలకే పరిమితం కాక..ఇతర సాహిత్య ప్రక్రియల్లో సైతం తన గుర్తింపును కొనసాగిస్తున్నారు. ఆయన ఇప్పటి వరకు తొమ్మిది పుస్తకాలను వెలువరించారు. హరిభట్టు, ఖమ్మం కథా సుధ, ఖమ్మం కవితా మాధురి, జీవన సంగీతం, ముసురు, తాటి కొండాల వంశచరిత్ర, భయద సౌందర్యం అనే కథా కవిత్వ పుస్తకాలతోపాటు కౌసల్య సుప్రజ రామా అనే నవలనువెలువరించారు. తెలుగు, సంస్కృతం, జోతిష్య శాస్త్రాల్లో ఈయన కాకతీత, ఉస్మానియా, తెలుగు యూనివర్సిటీల నుంచి ఎంఏ పట్టాలను పొందారు. అనంతరం బీఈడీ, బీఓఎల్ పూర్తి చేశారు.

తొలుత సినిమాల్లో ప్రయత్నం..

సినిమాల పట్ల అభిమానం గల తాటి కొండాల తొలుత ఆదిశగా ప్రయత్నం చేశారు. దర్శకుడు బీఎన్ రెడ్డి సహకారంతో కేవీ రెడ్డి వద్ద స్క్రిప్టు రచనలో కొంత కాలం పనిచేశారు. నిజాం కాలేజీ ఉత్సవాల్లో నాటకం ప్రదర్శిస్తున్నపుడు అతిథిగా హాజరైన దర్శకుడు బీఎన్ రెడ్డి ఈయనలోని నాటక ప్రతిభను గుర్తించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా వెళ్లిన ప్రతి చోట సాహిత్య, నాటక సమాజాలు, సంఘాలను స్థాపించారు. రేడియే కోసం అనేక రచనలు చేశారు. బీగ్రేడ్ ఆర్టిస్ట్‌గా సేవలందించారు. కొంత కాలం అపురూప అనే కల్చరల్ మ్యాగజైన్ నడిపారు.


నంది అవార్డు స్వీకరిస్తున్న నరసింహారావు

మెప్మా పీడీగా మనోహర్

- బాధ్యతలు స్వీకరించిన అధికారి



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 24: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి. మనోహర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్, సిరిసిల్లా, మంచిర్యాల కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. గత కొంత కాలంగా ఖమ్మం మెప్మా పీడీ స్థానం ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం పి. మనోహర్‌ను నియమించింది. ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన విభాగాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఖమ్మ నగర కమిషనర్‌ను కలిసిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయాధికారి

- నిర్వహణ తీరుపై సంతృప్తి

ఖమ్మం లీగల్ ఆగస్టు 24: జిల్లా న్యాయసేవాసంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వి.చంద్రశేఖర్‌రావు శనివారం జిల్లా జైలును సందర్శించారు. మొదట ములాకాత్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మహిళా బ్యారకును సందర్శించిన న్యాయాధికారి వారికేదైనా సమస్యలు ఉన్నాయా అని విచారించారు. డ్రగ్స్ కేసులలో పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. న్యాయసేవలు, ప్లీ బార్గేయినింగ్ గురించి వివరించారు. జైలు నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తొర్రికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల వద్ద పారిశుధ్య నిర్వహణ శూన్యం

- కేఎంసీ ఎదుట విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 24: వందల సంఖ్యలో విద్యార్థులతో ఉంటున్న ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల చుట్టూ కనీస పారిశుధ్య నిర్వహణ లేదని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో కేఎంసీ ఉద్రిక్తతకు దారి తీసింది. ఖమ్మం నగర పాలక సంస్థ ఎదుట నాయకులు, విద్యార్థులు బైటాయించి వాహనాలను అడ్డుకోవటంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట చోటు చేసుకొంది. ఈ క్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ నిరసనకారుల వద్దకు వినతిపత్రం స్వీకరించటంతో ఉద్రిక్తత సద్దుమనిగింది.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని కేఎంసీ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న దళిత, బీసీ, గిరిజన సంక్షేమ వసతిగృహాల చుట్టూ కనీస పారిశుధ్య నిర్వహణలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్ పై ఆశతో తల్లిదండ్రులను వదిలి వందల సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యాభ్యాసం చేస్తూ అనారోగ్యానికి గురై ఇంటిదారి పడ్తున్నారని అన్నారు. విద్యావైద్య, మున్సిపల్ శాఖల అధికారులు సంక్షేమ వసతిగృహాలను పట్టించుకోవటం లేదని అన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వందల సంఖ్యలో విద్యార్థులతో కలిసి గట్టయ్యాసెంటర్, సరితాక్లినక్ సెంటర్, బైపాస్‌రోడ్డులో ర్యాలీ చేపట్టారు. ఈ ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు షేక్ నాగుల్ మీరా, మధు, శివనాయక్, వంశీ, బూరా మనోజ్, రాకేష్, ప్రతాప్, పవన్, మౌనిక, వేద, కీర్తి, వేదన, శ్రీలత, స్వాతి, రజిని, రమ్య పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

ఇక్కడా కావాలొక 'హైడ్రా'

(5వ పేజీ తరువాయి)

భూసేకరణ జరిగినప్పుడు ఇప్పుడు ఎలా ఆక్రమణలు జరిగాయో, నిర్మాణాలు ఎలా చేపట్టారో విచారిస్తే చాలామంది ఖమ్మం నుంచి కలెక్టరేట్ వరకు కాలవ కు రెండు వైపులా పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎన్ఎస్‌పీ భూములను రియల్ వ్యాపారులు తప్పుడు పత్రాలతో విక్రయిస్తున్నారు. అలాగే ఎన్ఎస్‌పీ భూముల ఆక్రమణల్లో రాజకీయ పలుకుబడిన కలిగిన నేతలుండడంతో ఇప్పటి వరకు అధికారులు వాటిని తొలిగించలేని పరిస్థితి. ఎన్ఎస్‌పీ అధికారులే ఎన్ఓసీలు ఇవ్వడంతో రెవెన్యూ, ఎన్ఎస్‌పీ శాఖల నుంచి సమన్వయ లోపం తో పట్టించుకోకపోవడంతో ఇంకా ఖాళీగా ఉన్న ఎన్ఎస్‌పీ మిగులు భూముల కబ్జాలు సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ అసైన్డు దేవాదాయశాఖ, చెరువుశిఖాలపైనా కబ్జారాయుళ్లు కన్నేసి తమ పరపతితో సొంతం చేసుకుంటున్నారు.

జిల్లా కేంద్రం ఖమ్మంతో పాటు జిల్లాలో పలు మునిసిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని చెరువులు, ప్రభుత్వ భూములు పలువురు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. వీటిని తొలిగించాలంటే రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు ఎవరికివారు ఈ బాధ్యత మాది కాదంటూ తప్పించుకుంటున్నారు. హైడ్రా వంటి సంస్థలు జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుచేస్తే అన్నిశాఖలను సమన్వయం చేసుకుని ప్రభుత్వ, ప్రైవటు భూముల ఆక్రమణదారులపై కేసులు నమోదుచేసి కూల్చివేతకు చర్యలు తీసకునే అవకాశం ఉంటుంది.

ఖమ్మంలో కూడా పలువురు ప్రైవేటు వ్యక్తుల ప్లాట్లు, పట్టా భూములు సైతం కొంతమంది రౌడీషీటర్లు ఆక్రమించి దర్జాగా పాగా వేస్తున్న వారిని ఖాళీ చేయించలేని పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హైదరాబాదులో హైడ్రా ఏర్పాటుతో కబ్జాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నది. ఆక్రమణలు తొలిగించి చెరువులు, ఏర్లుకు నదులకు నీటి ప్రవాహానికి స్వేచ్ఛ కల్పిస్తోంది. జిల్లాల్లో కూడా ఈప్రక్రియకు శ్రీకారం చుడితే ఆక్రమణలు తొలిగిపోయి బఫర్ జోన్లు, చెరువుల శిఖాలు, ఎన్ఎస్‌పీ కాలవ భూములు , దేవాదాయ, అసైన్డుతో పాటు ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణల నుంచి కాపాడే అవకాశం ఉంటుంది.

శ్రీవారికి సర్వాంగాభిషేకం

జమలాపురం ఆలయంలో వేంకటేశ్వరస్వామికి ముత్యాల అలంకరణ

ఎర్రుపాలెం, ఆగస్టు 24:మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ముత్యాల కవచ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శనివారం కావడంతో స్వామివారిని ప్రత్యేకంగా ముత్యాల కవచాలతో అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సేవాసమితి నిర్వాహకులు ఎల్‌వీ నారాయణరెడ్డి, బొబ్బాకిరణ్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ, వేదపండితులు , అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీమద్భాగవత సప్తాహంలో అగ్నిప్రతిష్ఠ

భద్రాచలం, ఆగస్టు 24: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహంలో భాగంగా శనివారం చిత్రకూట మండపంలో అగ్నిప్రతిష్ఠ నిర్వహించారు. ముందుగా ఆరాధన, సేవాకాలం, శాత్తుముర్రై నిర్వహించగా అనంతరం సంప్రదాదయబద్ధంగా అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. వేద విన్నపాలు, శ్రీమద్భాగవత సప్తపారాయణం ప్రారంభం కాగా గోపూజ నిర్వహించారు. అనంతరం నిత్యపూర్ణాహుతి, మంగళశాసనం, ప్రసాద వినియోగం జరిపారు. రాత్రి శ్రీమద్భాగవత ప్రవచనంను అహోబిళ రామానుజ జీయర్‌స్వామి చేశారు.


అగ్నిప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

రామయ్యను దర్శించుకున్న బెల్లయ్యనాయక్, పొదెం

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారుల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణా హైకోర్టు న్యాయాధికారి బీమపాక నగేష్

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 24: పన్ను చెల్లింపుదారుల సాంకేతిక సమస్యలను టాక్స్ ప్రాక్టీషనర్స్ సత్వరమే పరిష్కరించాలని తెలంగాణా హైకోర్టు న్యాయాధికారి బీమపాక నగేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన నేషనల్ టాక్స్ కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లించే వారి పట్ల ప్రేమాభిమానాలతో మెలగాలని సూచించారు. పెద్ద వ్యాపారుల నుంచి చిన్న వ్యాపారుల వరకు పన్నులు చెల్లిస్తేనే దేశం అభివృద్ధి చెందుతందని అన్నారు. వారికి సహాయకారిగా ఉంటూ ఈ-వేబిల్లు, ఈ-ఇన్వాయిస్, రివర్స్ చార్జి మెకానిజం(ఆర్‌సీఎం), ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌పై, రిటర్నుల‌పై, ఆడిట్లపై, డీఆర్‌సీ నోటీసులపై, జీఎస్టీ యాక్ట్ పై జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఎప్పటికప్పుడు తెలియచేయాలని సూచించారు. పన్ను చెల్లింపుల్లో జాప్యం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్(సౌత్‌జోన్) చైర్మన్ రామరాజు, ఉపాధ్యక్షుడు ఉల్లెబోయిన సైదులు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎంవీకే మూర్తి, తెలంగాణా టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు, కమర్షియల్ టాక్స్ మాజీ కమిషనర్ పీవీ సుబ్బారావు, జీఎస్టీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఊరెల్లి స్వరూప్, జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ బాధ్యులు దుర్గా ప్రసాద్, రామక్రిష్ణ, పవన్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నర్సరీ వద్ద ఆందోళన

కూసుమంచి, ఆగస్టు 24: మండలంలోని చేగొమ్మ క్రాస్‌రోడ్డు సమీపంలోని తిరుపతమ్మ గుడి వద్ద ఉన్న మిర్చి నర్సరీ వద్ద శనివారం రాత్రి రైతులు ఆందోళనకు దిగారు. నర్సరీ నిర్వహకులు ఇచ్చిన నారు మొక్కలు నాటిన రెండోరోజే చచ్చిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తుర్కగూడెం, కోక్యాతండ, లోక్యాతండ, గ్రామాలకు చెందిన సుమారు 50మందికి పైగా రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతు మిర్చి నారు పెంపకం కోసం నర్సరీ యజమానికి తాము విత్తనాలు ఇచ్చామని తెలిపారు. ఇటీవల అదును రావడంతో మొక్కలను తీసుకెళ్లి నాటుకున్నామని, కానీ మొక్కలన్నీ చనిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూసుమంచి ఎస్ఐ నాగరాజు రైతులతో, నర్సరీ యజమానితో చర్చించి న్యాయం చేయిస్తామని హామీ ఇచ్చారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 2వ డివిజన్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఖమ్మం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) ఖమ్మం నియోజకవర్గంలో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపడుతున్నామని వీటిని నాణ్యతతో నిర్మించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో నూతనంగా నిర్మించే సీసీరోడ్లకు శంకుస్థాపనచేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ నియోకవర్గలో అవసరం ఉన్న చోట్ల సీసీరోడ్లుకు నిదులు మంజూరుచేస్తున్నామని, నాణ్యత విషయంలో రాజీపడకుండా అధికారుల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం నగరం అందంగా పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరుసహకరించాలని, కొత్తగా నిర్మించబోతున్న ఇళ్లకాలనీలకు కూడా రోడ్లు ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు.

సీజనల్ వ్యాధుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నరగరంలో ఎక్కడా నీరు నిలవ ఉండకూడదని, ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా కార్పొరేషన్ అధికారులు తగిన బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక అగస్త్య, అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, పాలెపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధిలో గ్రామ దీపికలదే ప్రధాన పాత్ర

తల్లాడ, ఆగస్టు 24: స్వయం సహాయక సంఘాల్లో సభ్యుల ఆర్థికాభివృద్ధిలో గ్రామదీపికలదే క్రియాశీలకమైన పాత్ర అని యూనియన్ బ్యాంకు ఖమ్మం రీజనల్ ప్రధాన అధికారి హన్మంత్‌రెడ్డి అన్నారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా తల్లాడ శాఖ, సెర్ప్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం తల్లాడ మండలం మల్లవరం రైతువేదికలో స్వయం సహాయక బృందాలు, బ్యాంకు అనుసంధానంపై గ్రామదీపికలను అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక బృందాలకు బ్యాంకులు అందించే రుణసదుపాయాల గురించి గ్రామదీపికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులు బ్యాంకు అనుసంధాన రుణాలు తీసుకునే స్వయం సమృద్ధి సాధించి తిరిగి సకాలంలో రుణాలు చెల్లించి ప్రయోజనం పొందాలని ఆయన కోరారు. అనంతరం మహిళా శక్తిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ ఉపప్రధాన అధికారి సుధాకర్‌రావు, ఏపీఎం చిన్నవెంకటేశ్వర్లు, యూబీఐ తల్లాడ శాఖ మేనేజర్ వి.రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న హన్మంత్‌రెడ్డి

కలుషిత నీటితో 9మందికి అస్వస్థత

పాల్వంచ రూరల్, ఆగస్టు 24: కలుషిత నీరుతాగి తొమ్మిది మంది అస్వస్థతకు గురైన ఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని పాతసూరారంలో జరిగింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పాతసూరారంలో ప్రజలు స్థానిక తాగునీటి బోర్లు, మిషన్‌భగీరథ నుంచి వచ్చే నీటిని తాగుతారు. ఈ క్రమంలో ఎప్పటిలాగే శనివారం కూడా ఆ నీటినే గ్రామస్థులు తాగారు. అయితే గ్రామంలోని రెండు వీధుల్లోని కుంజా శాంతి, భట్టు సూర్యనారాయణ, మెప్ప లక్ష్మి, సోయం బాలరాజు, యాకూబ్, నాగమణి, తాటిరాము, పర్సా వీరభద్రం, కోరగట్టు సత్యనారాయణ, ముడుగు సుశీలలు అస్వస్థతకు గురయ్యారు. వీరంతా వాంతులు, విరోచనాలతో బాధపడుతూ తొలుత స్థానిక గ్రామీణ వైద్యులను ఆశ్రయించారు. అయితే వీరంతా మరింత నీరసించి పోవడంతో ఆందోళనకు మెరుగైన వైద్యం కోసం ఆటోల్లో పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడి వైద్యులు వెంటనే వీరికి చికిత్స అందించారు. వీరిలో యాకూబ్ అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. కలుషిత నీరు తాగడం వల్లనే వారంతా అస్వస్థతకు గురయ్యారని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రఘునందన్ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఒకరిని మాత్రమే మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు తెలిపారు.

వైద్యశిబిరం ఏర్పాటు..

పాతసూరారం గ్రామంలో తొమ్మిది మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులందరికీ పరీక్షలు నిర్వహించారు. నీరసంగా ఉన్న వారికి సిలైన్ బాటిళ్లు పెట్టారు. చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్యం అందించారు. ఇళ్లల్లో వాంతులు, వారోచనాలతో బాధపడుతున్న వారికి సైతం వైద్యసేవలు అందించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే వరకు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తామని వైద్యులు జి. రాజు, కృష్ణప్రసాద్, మోహర్ క్రాంతి తెలిపారు.

బోర్లు, పైపులైన్ల వద్ద మురికినీరు..

పాతసూరారం గ్రామంలో తాగునీటి బోర్లు, మిషన్‌భగీరథ పైపులైన్ల వద్ద మురికి నీటిగుంతలు ఉండటంతోనే ఇటువంటి పరిస్థితి ఎదురైందని స్థానికులు ఆరోపించారు. పైపులైన్లు అక్కడక్కడ లీకేజీలు ఉండటంతో గుంతలు పడి మురికినీరు చేరడం; ఆ నీటినే తాగడంతోనే పలువురు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. పైపులైన్ల పొడవున పలుచోట్ల గుంతలను పూడ్చకపోవడం వల్ల లీకేజీల మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు కలుషితంగా మారిందని స్థానికులు ఆరోపిస్తోన్నారు. సీజన్‌లో ఒకవైపు వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా కలుషిత నీటితో పరిస్థితి మరింత దిగజారుతోంది. కలుషితనీటితో 9మంది అస్వస్థతకు గురైన విషయం తెలియగానే అధికారులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. పాల్వంచ ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో బొగ్గా నారాయణలు తాగునీటి బోర్లు, పైపులైన్ల లీకేజీలను పరిశీలించారు. నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

లాభాల వాటా 35 శాతం ఇచ్చేందుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజన్

మణుగూరు, ఆగస్టు 24: ఇంటర్నల్ ఆడిట్ తర్వాత కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం అనంతరం సింగరేణి సంస్థ లాభాల బోనస్ ప్రకటన వెలువడనుందని, అయితే ఈసారి కార్మికులకు 35 శాతం వాటా ఇచ్చేందుకు ఐఎన్‌టీయూసీ తరుపున గట్టి కృషిచేయనున్నట్లు ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఏరియాలోని కొండాపురం అండర్ గ్రౌండ్ మైన్‌లో జరిగిన పిట్ సమావేశంలో కార్మికులతో మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్ గతంలో యాజమాన్యానికి ఇచ్చిన వినతిపత్రాల నేపథ్యంలోనే మహిళా ఉద్యోగులకు భద్రత రక్షణపై సర్క్యూలర్ విడుదల అయిందన్నారు. అలాగే టెక్నీషియన్లు, సూపర్‌వైజర్ సిబ్బంది వివిధ గనుల్లో ఖాళీలను కనుగొని వాటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణంరాజు మాట్లాడుతూ త్వరలోనే కేపీయూజీ మైన్స్‌లో మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్యాంటీన్ వసతి కూడా ఈ గనిలో అనతి కాలంలోనే ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు షాబుద్దీన్, జయరాజు, ఎం.శ్రీనివాస్, సంతోష్ చరణ్, తాళ్లూరి రాములు, శ్యామ్, వర్మ, రాందాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ నమూనాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- 2026 నాటికి పునరాభివృద్ధి పనులు పూర్తి
- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్

హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో ప్రపంచశ్రేణి ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునిక రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతున్నామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి ర వ్‌నీత్ సింగ్ పేర్కొన్నారు. సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను 2026నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ఇప్పటి వరకు 27శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, తదితర రైల్వే అధికారులతో కలిసి రవ్‌నీత్ సింగ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.5,000 కోట్లకుపైగా అంచనా వ్యయంతో 119 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ హైదరాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా..రైల్ నిలయంలో శనివారం కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్‌తో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు.

వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులకు ఇన్‌చార్జిలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రులకు ఇన్‌చార్జిలను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 23 చోట్ల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ప్రస్తుతం అదనపు వైద్యవిద్య సంచాలకుల పదోన్నతులను వైద్యశాఖ చేపట్టిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల్లో ఆ పదోన్నతులు పూర్తయి, వారికి పోస్టింగ్స్ ఇచ్చేవరకే ఈ ఇన్‌చార్జిల పాలన ఉంటుందని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, హైదరాబాద్‌లోని బోధనాస్పత్రులకు ఇంకా ఇన్‌చార్జ్‌లను నియమించకపోవడం గమనార్హం.

కులగణన కోసం 2న కలెక్టరేట్ల ముట్టడి: జాజుల

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణనను వెంటనే ప్రారంభించి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన కోసం ఈ నెల 26న తలపెట్టదలచిన కలెక్టరేట్ల ముట్టడి శ్రీ కృష్ణ జన్మాష్టమి కారణంగా సెప్టెంబర్ 2కు వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. కలెక్టరేట్ల ముట్టడిలో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కులగణన నిర్వహించే వరకు బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తక్షణం కులగణను ప్రారంభించి బీసీ రిజర్వేషన్లు పెంచాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

మహిళా కమిషన్‌కు కేటీఆర్ సారీ!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. పునరావృతమైతే తగిన చర్యలుంటాయని హెచ్చరించారు. కేటీఆర్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలను సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ కేటీఆర్‌కు ఇటీవల నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ శనివారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరై వివరణ ఇచ్చిన అనంతరం చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ట్వీట్ చేశారు. మహిళలపై చేసిన వ్యాఖ్యల పట్ల కేటీఆర్ విచారం వ్యక్తం చేశారని, క్షమాపణలు చెప్పారని, అలాంటి ప్రకటనలు సరికాదని, తనలాంటి నాయకత్వ స్థాయికి అలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సరికాదని కేటీఆర్ అంగీకరించారని వెల్లడించారు. భవిష్యత్‌లో అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని కమిషన్ సూచించిందని చెప్పారు. విచారణకు కేటీఆర్ వెంట మాజీ మంత్రి సబిత, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, హరిప్రియా నాయక్, సత్యవతి రాథోడ్ వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లకు మధ్య తోపులాట జరిగింది. పరస్పరం భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఉద్రిక్త వాతావరణం ఏర్పడటంతో పోలీసులు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు సహా పలువురు కాంగ్రెస్ నాయకురాళ్లను అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు. కాగా, కమిషన్ ముందు హాజరవ్వడానికి వచ్చిన కేటీఆర్‌కు చైర్మన్ చాంబర్‌లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియమితులైన కమిషన్ సభ్యులు ఆరుగురు రాఖీ కట్టారు. దీనిపై చైర్‌పర్సన్ శారద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగురు సభ్యులకు నోటీసులు ఇవ్వాలని, న్యాయ సలహా అనంతరం తదుపరి చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సభ్యులకు ముందే హెచ్చరించినప్పటికీ సభ్యుల ప్రవర్తన అనుచితంగా, కమిషన్ నియమాలకు విరుద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. కమిషన్ నిష్పాక్షికతను, విశ్వసనీయతను దెబ్బతీసేలా వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. వీరిపై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాఖీ కట్టడం తప్పు కాదని, కమిషన్ కార్యాలయంలో కట్టడం సమంజసం కాదని చెప్పారు.



మహిళా కమిషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

కమిషన్‌పై గౌరవంతోనే హాజరయ్యా

కమిషన్‌పై గౌరవంతోనే స్వయంగా హాజరై నోటీసులకు సమాధానం ఇచ్చానని కేటీఆర్ అన్నారు. చైర్‌పర్సన్‌ను కలిసి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడారు. యధాలాపంగా చేసిన వ్యాఖ్యలపై ఇదివరకే క్షమాపణలు కోరానని చెప్పారు. తనకు మద్దతుగా కమిషన్ కార్యాలయానికి వచ్చిన బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలపై కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేలు సబిత, సునీత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తమపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం డౌన్ డౌన్ నినాదాలు చేశారు. కాగా, కేటీఆర్‌కు కమిషన్ సభ్యులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలపడం విడ్డూరంగా ఉందని బీజేపీ నాయకురాలు మాధవి విమర్శించారు. విచారణకు పిలిచిన వారందరికీ రాఖీలతో స్వాగతం పలుకుతారా?అని ప్రశ్నించారు.

మాపై దాడులు చేయించారు: సునీతరావు

కేటీఆర్ కమిషన్ ముందు, ట్విట్టర్‌లో కాకుండా బస్సు ఎక్కి మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ కార్యాలయం వద్ద.. అడ్డమీది కూలోళ్లను తీసుకొచ్చి తమపై కేటీఆర్ దాడులు చేయించారని ఆరోపించారు. దీన్ని సుమోటో కేసుగా తీసుకుని కేటీఆర్‌పై కేసు పెట్టాలని మహిళా కమిషన్‌ను కోరారు. మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్ విచారణ కోసం వెళ్లారా.. లేక దాడుల కోసమా అని మహిళా కార్పొరేషన్ చైర్మన్ బి.శోభారాణి ప్రశ్నించారు. తప్పును ఒప్పుకొని క్షమాపణలు అడగడానికి వచ్చిన కేటీఆర్.. మందిమార్బలంతో గొడవ ఎందుకు చేయించారని ప్రశ్నించారు.

వాల్మీకి స్కాంలో తెలంగాణ నేతల హస్తం: కేటీఆర్

కర్ణాటక ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న వాల్మీకి స్కామ్ వ్యవహారంలో తెలంగాణ నాయకులు, వ్యాపారవేత్తల హస్తం ఉందని కేటీఆర్ ఆరోపించారు. అలాంటి వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్‌లో తలెత్తుతున్న ప్రశ్నలకు కాంగ్రెస్ అగ్రనేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.45కోట్లు హైదరాబాద్‌లోని 9బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. ఆ ఖాతాలు ఎవరివి? వీ6 పేరుతో ఉన్న బిజినెస్ మీద ఆరోపణలు ఉన్నాయి. దాని యజమాని ఎవరు? వాల్మీకి స్కాంకు సంబంధించి హైదరాబాద్‌లో సిట్, సీఐడీ, ఈడీ దాడులు నిర్వహించిన తర్వాత కూడా ఈ వార్తలు తెలంగాణలో ఎందుకు రాలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

గండిపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

28 దుకాణాలను నేలమట్టం చేసిన అధికారులు

నార్సింగ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని గండిపేటలో రోడ్డుని ఆనుకుని అక్రమంగా నిర్మించిన 28 దుకాణాలను అధికారులు కూల్చేశారు. శనివారం నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో దుకాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. అనుమతిలేనందునే ఆయా నిర్మాణాలను కూల్చేశామని.. నిబంధనలు అతిక్రమించినా, అనుమతులు తీసుకోకపోయినా ఇలాంటి చర్యలే ఉంటాయని మునిసిపల్ అధికారులు హెచ్చరించారు. కాగా, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతూ హైడ్రా చేపట్టిన కూల్చివేతను సమర్థిస్తూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గండిపేట వాక్ నిర్వహించనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేశారు.



అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేయిస్తున్న అధికారులు



అక్రమ నిర్మాణాల కూల్చివేతను చేపట్టిన హైడ్రాకు మద్దతుగా ఆదివారం గండిపేటలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఏర్పాటు చేసిన పోస్టర్



ప్రాజెక్టులన్నీ నిండుగా..

589.70 అడుగులకు సాగర్ నీటి మట్టం

శ్రీశైలం, జూరాలకు మళ్లీ పెరిగిన వరద

నేడు 18 జిల్లాల్లో వర్షాలు.. ఎల్లో అలెర్ట్

హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వరద రాక కొనసాగుతుండడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు గాను శనివారం 589.70 అడుగులుగా ఉంది. 69,284 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 40,070 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర-సుంకేసుల ప్రాజెక్టుల మధ్య భారీగా వర్షాలతో శ్రీశైలానికి 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా 884.40 అడుగులకు చేరింది. ఎగువ కృష్ణ, ఎగువ బీమా పరివాహకాలలో వర్షాలతో కృష్ణా నదికి స్వల్పంగా వరద వస్తోంది. ఆల్మటి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు అయితే 128.19 టీఎంసీలకు చేరింది. 6,565 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నారాయణపూర్‌కు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 35 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర గేటు మరమ్మతు అనంతరం నిల్వలను పెంచుతున్నారు. 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 వేల క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. జూరాలకు వరద గణనీయంగా పెరిగింది. 86 వేల క్యూసెక్కులు చేరుతుండగా ఔట్‌ఫ్లో 82 వేల క్యూసెక్కులుగా ఉంది. పులిచింతలకు 30,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 28,631 క్యూసెక్కులను వదులుతున్నారు. కాళేశ్వరంలో ప్రధానమైన మేడిగడ్డకు 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మొత్తం నీటిని కిందకు పంపిస్తున్నారు. ఎల్లంపల్లికి 23,094 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కాగా, రాష్ట్రంలో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

గురుకులాల పనితీరు భేష్

- విద్యాశాఖకు గవర్నర్ ప్రశంస

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. నాణ్యమైన బోధనతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని కొనియాడారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో గవర్నర్ శనివారం రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, విద్యాసంస్థల్లో బోధన, తదితర అంశాల గురించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) వాలంటీర్లను సామాజిక పరివర్తన దిశగా మళ్లించేందుకు విద్యాశాఖ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

క్రైం సమాచారం

మట్టి ముట్టుకుంటే బైండోవర్ చేస్తాం

- 16 మంది అక్రమ మట్టి వ్యాపారులకు కౌన్సిలింగ్

రఘునాథపాలెం, ఆగస్టు 24: నిబంధనలకు విరుద్ధంగా సహజ వనరుల నుంచి అక్రమంగా మట్టి ముట్టుకుంటే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఏసీపీ రమణమూర్తి హెచ్చరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానల్‌లో వచ్చిన అక్రమ మట్టి తోలకాల కథనాలపై రెవెన్యూశాఖ, పోలీసు అధికారులు తీవ్రంగా స్పందించారు. రఘునాథపాలెం మండల పరిధిలో అక్రమంగా మట్టి తోలకాలు జరిపిన రఘునాథపాలెం, బల్లేపల్లి, కోయచెలక, జింకలతండా, ఖమ్మం నగరానికి చెందిన 16 మంది మట్టి తోలకాల వ్యాపారులను శనివారం తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. తహసీల్దార్ లూథర్ విల్సన్, ఏసీపీ రమణమూర్తి, సీఐ ఉస్మాన్ షరీఫ్ మట్టి వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు చేశారు. తొలి హెచ్చరికగా చెపుతున్నామని, మరోసారి అక్రమ మట్టి వ్యాపారం చేస్తే కఠినమైన చర్యలు తీసకుంటామని తెలిపారు. ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వ అమోదం మేరకు మట్టి సరఫరా చేయాలని ఆదేశించారు.

అనారోగ్యంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి

కొణిజర్ల,ఆగస్టు24: మండల కేంద్రమైన కొణిజర్ల గ్రామానికి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ దుగ్గిరాల కోటేశ్వరరావు(33) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అతడి మరణవార్త తెలుసుకున్న సీపీఐ జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దొండపాటి రమేష్ శనివారం ఉదయం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కోటేశ్వరరావు విద్యుత్ వినియోగదారులకు ఎన్నో సేవలను అందించారని ఆయన కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో స్వర్ణ రమేష్, తండు సోమయ్య, గొడ్డుగర్ల శ్రీను, ఎర్రశ్రీను, బండారు పుల్లయ్య, పుట్టా సత్యనారాయణ, ప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

జ్వరంతో చిన్నారి కన్నుమూత

వైరా, ఆగస్టు 24: వైరా మునిసిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం రాత్రి జ్వరంతో ఆఫ్షా సిద్ధిక(5)అనే చిన్నారిని మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... శాంతినగర్‌లోని అక్బర్, నూర్జహాన్ దంపతుల రెండో కుమార్తె ఆఫ్షా సిద్ధిక ఎల్‌కేజీ చదువుతుంది. చిన్నారికి గురువారం జ్వరం రావడంతో వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఇక్కడ వైద్యపరీక్షలు చేసిన డాక్టర్ ఆఫ్షా సిద్ధిక ఖమ్మం తీసుకువెళ్లమని సూచించగా తల్లిదండ్రులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు శుక్రవారం రాత్రి ఖమ్మంలోనే మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి ఫిట్స్ రావడంతో మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు కూలీపనులు చేసుకొని జీవిస్తున్నారు. ఐదేళ్లకే నూరేళ్లు నిండటంతో ఆఫ్షా సిద్ధిక తల్లిదండ్రులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ హృదయ విదాకర సంఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

జ్వరంతో వ్యక్తి ..

మణుగూరు, ఆగస్టు 24 : మణుగూరు మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన సపక మోహన్‌రావు (32) గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్య సేవలు పొందుతూ శనివారం మృతిచెందాడు. రాఖీ పండుగ నుంచి జ్వరంతో ఇబ్బంది పడుతున్న మోహన్ రావు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్సలు పొందాడు. జ్వరంతో పాటు కామెర్లుకూడా సోకినట్లు తెలిసింది. దీంతో భద్రాచలం కొత్తగూడెం ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలందించారు. పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

జూలూరుపాడు, ఆగస్టు 24: అటవీ భూమి ఆక్రమణకు యత్నించిన సంఘటనలో విచారణ సందర్భంలో వివాదం తలెత్తడంతో శనివారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో అటవీ శాఖాధికారులు, గిరిజన వ్యక్తి పరస్పరం ఫిర్యాదులు చేశారు. పాపకొల్లుకు చెందిన ధారావత్ ప్రసాద్ గిరిజన వ్యక్తి జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని రాజారావుపేట అటవీ ప్రాంతంలో చెట్లను నరికి అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. శుక్రవారం రాజారావుపేట అటవీ ప్రాంతాన్ని కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు సందర్శించారు. అటవీ సిబ్బందిపై ప్రసాద్, అతని తల్లి కలిసి దాడి చేసేందుకు యత్నించారని ఎఫ్‌డీవో రహీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో తమను అటవీ ప్రాంతానికి పిలిపించి నాతోపాటు మా తల్లి బుజ్జిలపై దుర్భషలాడుతూ ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్‌వో, ఎఫ్‌బీవోలు తమను కొట్టారని గిరిజన వ్యక్తి పోలీలకు ఫిర్యాదు చేశారు.

యూరియా అక్రమ రవాణాపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా కో ఆపరేటీవ్ అధికారి సయ్యద్ ఖుర్షీద్

సొసైటీ కార్యదర్శి సస్పెన్షన్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 24: ఇల్లెందు సహకార పరపతి సంఘం నుంచి యూరియాను అక్రమంగా వ్యాపారికి తరలించిన సంఘటనపై జిల్లా కో ఆపరేటీవ్ అధికారి సయ్యద్ ఖుర్షీద్ శనివారం విచారణ నిర్వహించారు. సహకార పరపతి సంఘం కార్యాలయం, వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న రెవిన్యూ గోడౌన్లను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక చర్యల్లో భాగంగా సొసైటీ కార్యదర్శి హరిప్రసాద్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ సెక్రటరీగా జి. హీరాలాల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీకి చెందిన యూరియాను అక్రమంగా రవాణా చేసినట్లు వచ్చిన కథనాలపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేశారని వారి నివేదిక సైతం ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. సహకార సంఘ ఉద్యోగుల బైలా ప్రకారం కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

'మధ్యాహ్న భోజనం'లో నాణ్యత పాటించాలి

- చౌకదుకాణాలు సమయపాలన పాటించాలి
- విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 24: 'ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు మధ్యాహ్న భోజనం నాణ్యమైనది అందించాలి, చౌకదుకాణాల్లో సమయపాలన పాటించి వినియోగదారులకు బియ్యం సకాలంలో అందించాలని' జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి విజిలెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో చౌకధరల షాపులకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీ, ప్రభుత్వ వసతి గృహాలకు, అంగన్‌వాడీలకు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ విషయమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం నాణ్యత విషయంలో అధికారులు పరిశీలన చేయాలన్నారు. బియ్యం భద్రపరచడం, ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి వసతి గృహాలకు పంపిణీపై సూచనలు చేశారు. చౌక ధరల షాపుల డీలర్లు సమయపాలన పాటించాలని, షాపులో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిష్టర్, డీలర్ లైసెన్స్ ప్రదర్శించాలన్నారు. ప్రతి మూడు నెలలకు జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశం చేపట్టి ఆదేశాల అమలుపై సమీక్ష చేయనున్నట్లు, అతిక్రమించిన వారిపై చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. అనంతరం జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేసుకున్న వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరనే తీసుకోవాలని, అధికంగా వసూలు చేయకూడదన్నారు.



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

అనంతరం పెట్రోల్ బంకు యజమానులు, కంపెనీల సేల్స్ అధికారులతో మాట్లాడుతూ వియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. ప్రతి బంకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా 'బీ' ఫారం లైసెన్సు కలిగి ఉండి, లీగల్ మెట్రాలజీ వారి అనుమతి పత్రం, ఎక్స్ ప్లోజివ్ లైసెన్సు అనుమతి పత్రాలు కలిగివుండాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. స్టాక్ బోర్డ్, నేమ్ బోర్డు, సేల్స్ అధికారి సెల్ నెంబర్, నో స్మోకింగ్ బోర్డు ప్రదర్శించాలన్నారు. ప్రతీ బంకులో మరుగుదొడ్లు వినియోగదారులకు ఉపయోగపడేలా శుభ్రంగా ఉంచాలన్నారు. ఉచితంగా గాలి మిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాణోత్ ప్రమీల, ఆవుల శిరీష, సంబంధిత షాపుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వారసులకు
కారుణ్య నియామకపత్రాల అందజేత

కొత్తగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పని చేస్తున మెడికల్ ఇన్వాలిడేట్, మరణించిన కార్మికుల అర్హత కలిగిన డిపెండెంట్లకు కారుణ్య నియామకాల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల పిల్లలకు శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు కారుణ్య నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంసనీఎండి ఆదేశాల మేరకు 2018 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలను జరుగుతున్నవి ప్రసుత్తం ఈ నెలలో 15 మందికి కారుణ్య నియామకాల పత్రాలు అందచేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన ఈ అవకాశాన్ని శ్రద్ధగా క్రమశిక్షణతో సెలవులు లేకుండ పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, రానున్న కాలంలో విద్యార్థులకు తగిన స్థాయిలో ఉద్యోగాలను పొందాలని ఆకాంక్షించారు. కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగూడెం ఏరియాలో 599మందికి కారుణ్య నియామకపత్రాలు అందచేశామని, వారు కంపెనీలో బదిలీ వర్కర్‌లాగా నియామకం అయి కంపెనీ నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో అర్హత సాధించిన వారు ప్రమోషన్ పొంది వివిధ పోస్టుల్లో పని చేస్తున్నారని అన్నారు. డిపెండెంట్ ఉద్యోగంను పొందిన వారసులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవి. కోటిరెడ్డి, సీనియర్ పీవో ఎం. మురళీ, ఎఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొత్తగూడెం ఏరియా జే. గట్టయ్య, జూనియర్ అసిస్టెంట్ కే. అరవింద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామరస్య పరిష్కారానికే
లోక్‌అదాలత్‌లు

ఖమ్మం లీగల్ ఆగస్టు 24: వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవటానికి చక్కటి వేదిక లోక్‌అదాలత్ అని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయసేవాసంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖర్‌రావు అన్నారు. శనివారం న్యాయాధికారి న్యాయసేవా సదన్‌లో వివిధ ప్రీ లిటిగేషన్ కేసులలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ప్రీ లిటిగేషన్ విధానంలో రాజీ పడినట్లయితే వారి విలువైన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. తల్లిదండ్రులను, భార్యా పిల్లలను పోషించటం చట్టప్రకారం కర్తవ్యం అని వీటి నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. అందువల్ల ఇటువంటి కేసులలో తక్షణం రాజీపడటం వల్ల యిరుపక్షాల వారికి లబ్ధిచేకూరుతుందన్నారు. న్యాయసేవాసంస్థ నుంచి నోటీసు అందుకుని గైర్హాజరు అయినా ప్రభుత్వ అధికారులపై తగిన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన అన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



పోలీస్‌స్టేషన్‌లో దండలు మార్చుకున్న ప్రేమికులు

జూలూరుపాడు, ఆగస్టు24: పోలీసులను ప్రేమ జంట ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని వేడుకున్న సంఘటన శనివారం జూలూరుపాడులో చోటు చేసుకుంది. పాపకొల్లు గ్రామానికి చెందిన దారావత్ రామారావు, పాపకొల్లు పంచాయతీ పరిధిలోని వెనుకతండా గ్రామానికి చెందిన బాణోత్ శ్రావ్య గత ఏడు సంవత్సరాల నుంచి ప్రేమించుకున్నారు. వారిద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ క్రమంలో శ్రావ్య కుటుంబ సభ్యులు పెళ్లి చేసేందుకు నిరాకరించారు. దీంతో వారిద్దరు అశ్వాపురంలోని ఓ ఆలయంలో వివాహం చేసుకొని వచ్చి తమకు రక్షణ కల్పించాలని జూలూరుపాడు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబాల సభ్యులను పిలుపించి మాట్లాడారు. పోలీస్‌ల సమక్షంలో మరో సారి వారిద్దరు దండలను మార్చుకున్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

బూర్గంపాడు, ఆగస్టు 24: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో శనివారం దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. జంగారెడ్డిగూడెం మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన నగేష్, జానవి ఇరువురు సారపాకలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరువురు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



పాల్వంచ, అగస్టు 24: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం మల్లారం గ్రామానికి చెందిన పడిగె శ్రావణి(25)కి నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన పడిగె భిక్షంతో ప్రేమ వివాహం జరిగింది. గత రెండు సంవత్సరాల నుంచి భిక్షం వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని శ్రావణిని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. ఈ క్రమంలో అతని వేధింపులు భరించలేక బుధవారం ఇంట్లో గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందడంతో మృతురాలి తండ్రి వజ్జా నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.



'నాగరాజుపై కేసు ఉపసంహరించాలి'

ఆళ్లపల్లి, ఆగస్టు 24: ఆగస్టు 21న మర్కోడు పంచాయతీ కార్యదర్శి నాగరాజుపై ఏసీబీ అధికారులు పెట్టిన కేసును తక్షణం ఉపసంహరించుకోవాలని కోరుతు బుధవారం ఆళ్లపల్లి, గుండాల ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుందెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏసీబీ అధికారులు మర్కోడు మాజీ ఉపసర్పంచ్ కుర్ర కమలకు, ఆళ్లపల్లి ఎంపీవో శ్రీనివాస్‌కు కమీషన్ల విషయంలో సరైన ఆధారాలు లేకుండా, మధ్యవర్తిగా నాగరాజు వ్యవహరించినట్టు పట్టుకోవడం సరైంది కాదని ఆదివాసీలు ఆరోపించారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాగరాజును ఏసీబీకి పట్టించడం కేవలం ఒక రాజకీయ కుట్రనేనని, గతంలో కూడా ఉపసర్పంచ్‌కి కార్యదర్శికి మధ్య గొడవలు జరిగాయని, రాజకీయ పలుకుబడితో అమాయకుడైన ఆదివాసీ నాగరాజును ఏసీబీకి పట్టించడం జరిగిందని అన్నారు. జిల్లా అధికారులు జరిగిన సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి నాగరాజును విడుదల చేయాలని కోరారు.

హోటళ్లను తనిఖీ చేసిన సివిల్ సప్లై డీటీ

మణుగూరు, ఆగస్టు 24: మణుగూరులోని పలు హోటళ్లలను సివిల్ సప్లై డీటీ శివకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పలు హోటళ్ల వంటకు వాడే సిలిండర్లను పరిశీలించారు. కమర్షియల్ సిలిండర్ల తప్ప మరే ఇతర సిలిండర్లు కన్పించలేదని తెలిపారు.

'అనుమానితుల సమాచారం తెలపండి'

మణుగూరు , ఆగస్టు 24 : మీ గ్రామంలో నివాసముండే వారు కాకుండా కొత్త వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో అనుమానితులుగా తిరిగే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలపాలని మణుగూరు సీఐ ఆదివాసీ గిరిజన గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని శివారు అటవీ గిరిజన గ్రామమైన సర్వాయిగుంపు గ్రామాన్ని చేరుకుని స్థానిక గిరిజనులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎంత మంది ఉంటున్నారు.. కొత్తవారు ఎవరైనా వచ్చారా అన్న విషయాలపై ఆరా తీశారు. పోలీసులకు సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ మేడ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో రాగి వైరు చోరీ

దమ్మపేట, ఆగస్టు 24: మందలపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాగి వైరును చోరీ చేశారు. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి 10 కిలోల రాగి వైరును చోరీ చేశారు. ఘటనపై ఏఈ సాయి కిరణ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

విద్యా సంస్థల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి



లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల్లో

భద్రాచలం, ఆగస్టు 24: భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్, సెయింట్‌పాల్స్ త్రివేణి పాఠశాలతో పాటు పలు విద్యా సంస్థల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు విచిత్ర వేషధారణలతో అలరించారు. అలాగే పలువురు చిన్నారులు నృత్యాలు చేశావారు. అదేవిధంగా పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎల్ఎఫ్ విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్, మాగంటి రమేష్ బాబు, సెయింట్‌పాల్స్ పాఠశాల కరస్పాండెంట్ అబ్రహం, త్రివేణి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విమలదేవి పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలం, ఆగస్టు 24: భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా పాల్గొన్న భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు ర్యాగింగ్ నిరోదం, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. అలాగే భద్రాచలం సీఐ సంజీవరావు ట్రాఫిక్ నిబంధనలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, న్యాయవాదులు బి.రమేష్, కొలిచలం నవీన్‌కుమార్, అవులూరి సత్యనారాయణ, పేరాల వెంకటేశ్వర్లు, పామరాజు తిరుమలరావు, సాధనపల్లి సతీష్, సంధ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం న్యాయమూర్తి వెంకటేశ్వర్లు వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న పోషకాహారం, వైద్య సదుపాయాల్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు.

'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

జూలూరుపాడు, ఆగస్టు 24: సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ తిరుపతిరావు సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో విద్యార్థులకు, యువకులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దు అని, ఆధార్, బ్యాంక్ ఖాతా, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, సిబ్బంది వెంకట్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతం తనిఖీ

జూలూరుపాడు, ఆగస్టు 4: జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని రాజారావుపేట అటవీ ప్రాంతంలో కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి చెట్లను నరికి అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులకు అదే గ్రామానికి చెందిన కొందరు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం అటవీ శాఖ టాస్క్ ఫోర్స్ ఎఫ్ఆర్వో ప్రసాద్ రాజారావుపేట అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. సదరు వ్యక్తి నరికిన చెట్లను పరిశీలించారు. అటవీ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. హద్దుల వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ సెక్షన్ అధికారులు క్రాంతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి: తహసీల్దార్

జూలూరుపాడు, ఆగస్టు 24: బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలన్నింటిని నమోదు చేయాలని తహసీల్దార్ స్వాతి బిందు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌వోలు సర్వేను పకడ్బందీగా చేపట్టి వచ్చే నెల 18 నాటికి పూర్తి చేయాలన్నారు. ఇంట్లో ఉన్న ఓటర్ల వివరాలతో పాటు, ఇంటి నెంబరు వివరాలను సేకరించాలని తెలిపారు. అదేవిధంగా చనిపోయిన ఓటర్లను జాబితాలో నుంచి తొలిగించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

'స్వచ్ఛ భారత్' రిక్షాల దుస్థితి ఇదీ..

లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



పాత ఇనుప దుకాణంలో స్వచ్ఛ భారత్ రిక్షాలు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 24: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చెత్తను సేకరించటానికి అందజేసిన రిక్షాలు పాత ఇనుప సామాను క్రింద అమ్మేసారు. లక్షలాది రూపాయలు విలువచేసే ఈ రిక్షాలు అశ్వారావుపేటలోని ఓ పాత ఇనుప సామాగ్రిని కొనుగోలు చేసే దుకాణాల్లో పదుల సంఖ్యలో దర్శనమిచ్చాయి. ఒక్కో పంచాయతీకి పంచాయతీ విస్తీర్ణాన్ని బట్టి మూడు నుంచి పది వరకు రిక్షాలను ప్రభుత్వం అందజేసింది. ఈ రిక్షాలను అక్కడ అధికారులు, సిబ్బంది వినియోగించకుండా చాలా కాలంగా కార్యాలయాలవద్దే ఉంచేసారు. దీనిపై అనేక మార్లు గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ రిక్షాలను అధికారులు వినియోగంలోకి తేలేకపోయారు. కార్యాలయాలవద్దే తుప్పు పట్టిపోతూ కనిపించాయి. తాజాగ ఈ రిక్షాలను ఏకంగా పాత ఇనుప సామాగ్రికింద బహిరంగ మార్కెట్‌లో విక్రయించేసారు. లక్షలాది రూపాయల నిధులు వృథా అవుతున్నాయి. వినియోగించకుండా ఉన్న ఈ రిక్షాలను కొందరు సిబ్బంది అక్రమంగా అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి పాత ఇనుపదుకాణాలలోని రిక్షాలను స్వాధీనం చేసుకొని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది. ప్రజాధనం వృథా అవుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన రిక్షాలు బహిరంగ మార్కెట్‌కు చేరడంపై అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై అశ్వారావుపేట మండల పంచాయతీ అధికారి ఎస్ ప్రసాదరావుని. ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. స్వచ్ఛ భారత్ రిక్షాలున్న పాత ఇనుప కొట్టు వద్దకు వెళ్లి రిక్షాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఎవరు విక్రయించారో విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సలహాలు, సూచనలు ఇవ్వండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. శనివారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, పాత్రికేయులు, నిపుణులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, దీనిలో భాగంగానే నూతన రెవెన్యూ చట్టం 2024 ముసాయిదాబిల్లు రూపొందించిందని కలెక్టర్ చెప్పారు. నూతన చట్టం రూపకల్పనలో రైతులను, ప్రజలను, మేధావులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్‌షాపులో నిర్వహించాలని ఆదేశించిందని కలెక్టర్ తెలిపారు. బిల్లు అంశాలు, రైతుల భూ రికార్డులు పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశంతో ముసాయిదా బిల్లుపై మేధావులు, విద్యావేత్తలు, రెవెన్యూ అధికారులు, రిటైర్డ్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, రైతులు, రైతు సంఘ నాయకులు తమ సూచనలు అందచేయాలని కలెక్టర్ కోరారు. రైతులు మాట్లాడుతూ చట్ట మార్పు చేసేటప్పుడు భూ సర్వే నిర్వహించాలని, భూమిపై ఉన్న రైతులు మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధు, దామోదర్, తహసిల్దార్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి: తహసీల్దార్



చికెన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

దుమ్ముగూడెం, ఆగస్టు 24: దుకాణదారులు పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. లక్ష్మీనగరంలోని చికెన్ దుకాణాలను శనివారం పరిశీలించారు. చికెన్‌షాపుల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఊరికి దూరంగా పారేయాలని సూచించారు. పరిసరాల అపరిశుభ్రతతో అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న లక్ష్మీనగరంలోని రెవిన్యూ విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు.

డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

అవగాహన సదస్సులో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్ కుమార్

పాల్వంచ, అగస్టు 24: విద్యార్థులు డ్రగ్స్ ర్యాగింగ్‌లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్ పర్యవసానాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మనిషి జీవితంలో కీలకమైన దశ విద్యార్థి దశ అని, ఆ దశలో చెడు వ్యసనాలకు బానిసలుగా మారకూడదని, అందుకే వారందరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. అదే విధంగా ప్రస్తుత సమాజంలో విద్యార్థుల మధ్య అసమానతలను పెంచే ర్యాగింగ్‌ను ప్రోత్సహించవద్దని, కళాశాలల నుంచి ర్యాగింగ్ మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నేరప్రవృత్తిని ప్రేరేపించే గంజాయి, హెరాయిన్, కొకైన్‌లాంటి మత్తుపదార్థాలను ఎవరైనా వినియోగిస్తున్నా, సరఫరా చేస్తున్నా వారి సమాచారాన్ని పోలీసులకందించి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, రూరల్ ఎస్ఐ సురేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న భూలక్ష్మి

అశ్వాపురం, ఆగస్టు 24: కోల్‌కత్తా మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలు మౌమితను పాశవికంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళాసంఘం జిల్లా కార్యదర్శి సున్నం భూలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. మౌమితపై జరిగిన హత్యాచారం సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, నిర్భయ, దిశ లాంటి చట్టాలు ఉన్నా, మహిళలకు రక్షణకరువయ్యిందన్నారు. మౌమితపై అత్యాచారం, హత్య జరిగి రోజులు గడుస్తున్నా బెంగాల్ ప్రభుత్వం కనీసం ప్రాథమిక నివేదిక ఇవ్వకపోవటం దారుణమన్నారు. సదస్సులో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పీవో డబ్ల్యూ నాయకురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల సమస్యలు 'పరిష్కరించాలి'



సమావేశంలో పాల్గొన్న మాథ్యూస్, ఉద్యమకారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 24: తొలిదశ 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక లాఠీ దెబ్బలు తిన్నామని, ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు చేశామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేజీఎస్ మ్యాథ్యూస్ తెలిపారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో టీటీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమ కారులకు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్త శుద్ధి కరువైందన్నారు. ఇప్పటికే మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలిపినప్పటికి వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తమను అవమానించినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలిదశ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన వారికి, మరణించిన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మరోసారి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి సమస్యలను విన్నవిస్తామని అన్నారు. ఈ సమావేశంలో తొలిదశ ఉద్యమకారులు జయరాజ్, రాంచందర్, గౌస్, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, వీరస్వామి, యాదగిరి, సాంబయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్



మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

పాల్వంచటౌన్, ఆగస్టు 24: గిరిజనుల అభివృద్ధికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. శనివారం పాల్వంచలో గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు రమేష్ రాథోడ్, బానోత్ రవికుమార్ ఆధ్వర్యంలో బెల్లయ్య నాయక్ సన్మానసభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయనను కాంట్రాక్టర్స్ కాలనీ వాసులు, గిరిజన ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు, పలువురు ఆదివాసీ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బెల్లయ్య నాయక్ అలుపెరగని పోరాటం చేసి తండాలను పంచాయతీలుగా చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగ సీతరాములు, పట్టణ అధ్యక్షుడు రంగారావు, డాక్టర్ శంకర్‌నాయక్, బాలూ నాయక్, కేసూలాల్, ఎన్ఎండీసీ బాలూనాయక్ పాల్గొన్నారు.

'వైద్యశాలలో సమస్యలను పరిష్కరించాలి'

ఇల్లెందు టౌన్, ఆగస్టు 24 : ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో అపరిశ్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం లేదని సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ విమర్శించారు. శనివారం వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. వైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, రోగుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 100పడకల ఆసుపత్రిగా ప్రకటించినప్పటికి మౌళిక వసతులు కల్పించడం లేదని వాపోయారు. పాత రోగాలతో వైద్యశాలకు వస్తే కొత్తరోగాలు అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అలేటి కిరణ్‌కుమార్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, మునిగంటి లక్ష్మి, తాళ్లూరి పద్మ, మహ్మద్, వెంకన్న, సత్యనారాయణ, మమతా, తోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి'

అశ్వాపురం, ఆగస్టు 24: ఆటోడ్రైవర్లు తమ ఆటోలను నడిపే సమయంలో నిబంధనలు పాటించాలని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆటోడ్రైవర్ల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు తప్పని సరిగా డ్రస్ కోడ్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని పేర్కొన్నారు. మద్యం సేవించి ఆటోలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

'పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

దుమ్ముగూడెం ఆగస్టు 24: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తాజా మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ పిలుపునిచ్చారు. శనివారం లక్ష్మీనగరంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాటాడారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేయడం బీఆర్ఎస్ పార్టీకి మింగుడు పడడం లేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలం నుంచి అత్యధిక సర్పంచి స్థానాలను కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. మాజీ మండల అధ్యక్షుడు అబ్బులు, కుంజా శ్రీనివాసు, సుధాకర్, మట్టా శివాజీ, సూర్యచంద్రరావ, పలువురు తాజా మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

చుంచుపల్లి, ఆగస్టు 24: గ్రామీణా వైద్యులు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ శనివారం ఆదేశించారు. జ్వరాలతో బాధపడే వారు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలన్నారు. గ్రామీణా వైద్యులు ప్రథమ చికిత్సలు అందించేందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అర్హతకు మించి తమ వద్దకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్లూయిడ్స్ ఎక్కించడం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. సాధారణ జ్వరాన్ని డెంగ్యూ జ్వరం అంటూ కొంతమంది ఆర్ఎంపీలు రోగులను దోచుకుంటున్నారని, అలాంటి వారిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేస్తుందని తెలిపారు. ఇప్పటికే కొన్ని ఆర్ఎంపీలు నడిపే ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేయడం జరిగిందన్నారు.

అభివృద్ధికి ఐటీసీ సహకారం అభినందనీయం: పాయం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, ఆగస్టు 24: గ్రామాల అభివృద్ధికి ఐటీసీ చేస్తున్న సహకారం అభినందనీయమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక, ఇరవెండి గ్రామాలలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఇరవెండి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐటీసీ సహకారంతో విద్యాజ్యోతిలో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం సారపాకలో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న మంచినీటి పైపులైను పనులకు భూమిపూజ కార్యక్రమం చేపట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఐటీసీ హెచ్ఆర్ జీఎం శ్యామ్‌కిరణ్, మేనేజర్ చెంగళరావు, ఎంపీడీవో జమలారెడ్డి, గ్రామపంచాయతీ ఈవో మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సతీష్, మహ్మద్‌ఖాన్, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, హరీష్, రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగమణి, రేణుక, టీఎన్‌టీయూసీ నాయకులు హరిప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, టిడిపి నాయకులు జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. సారపాక పర్యటనకు వచ్చిన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు సీపీఐ పార్టీ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం ఆందజేశారు.

వైద్యశాలను తనిఖీ చేసిన జీఎం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 24: సింగరేణి ఇల్లెందు ఏరియా వైద్యశాలను శనివారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారితో అప్యాయంగా మాట్లాడాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వాతావరణంలో మార్పుల వల్ల కార్మికులు, వారి కుటుంబసభ్యులు జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాలకు వచ్చే రోగులకు త్వరితగతిన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. వైద్యశాలలో ఎటువంటి అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని జీఎం కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

TOURS & TRAVELS
★ మహాదేవ టూర్స్: చార్‌ధామ్ 20/9 రూ.30 వేలు, నేపాల్ ముక్తినాథ్ 14/10 రూ.33 వేలు, కార్తీకం కాశీ 6/11 రూ.17500/-, రామేశ్వరం 25/11 రూ.18500/-. సంప్రః: 9908844377
AJH-4264

PLOT FOR SALE
★ Open Plots for sale@Warangal H/W kondamadugu Nr: AIIMS 7500/- P.Sqyd offer price:6500/- Contact: 9177871177 / 9100787578
AJH-002616

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds
220/- Only
Extra Line 45/- only
ఖమ్మం
9985406151
9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347